సాక్షి నిజామాబాద్

ఆదివారం । 28 । జూలై । 2024



ఆయకట్టుకు భరోసా

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో పంటల సాగుకు ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు.

- 10లో ▸



మక్కరైతు ఆశలపై ముసురు

వారం రోజులుగా కురుస్తున్న ముసురుతో మక్క పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /22.6

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. పలుచోట్ల మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



నిజామాబాద్ నాగారం: గుండెపోటు వచ్చిన వారిని కాపాడటానికి సీపీఆర్‌పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ అన్నారు. శనివారం వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉద్యోగులతో పాటు వివిధ వర్గాల వారికి సీపీఆర్ శిక్షణ ఆవశ్యకతపై కలెక్టరేట్‌లో 'పునర్జన్మ' పేరుతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్ ఎలా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఆహారపు అలవాట్లు, మారిన జీవనశైలితో ప్రస్తుతం అనేక మంది గుండెపోటుకు గురవుతున్నారని చెప్పారు. సీపీఆర్ చేస్తే గుండెపోటుకు గురైన 10మందిలో ఐదుగురు బతికే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సీపీఆర్ టెక్నిక్ తెలిసిన వారు మరో పది మందికి నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో రసూల్ బీ, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కృష్ణవేణి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నాగూరావ్ పాల్గొన్నారు.

రుణమాఫీపై ఆందోళన వద్దు

- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు



డిచ్‌పల్లి: రుణమాఫీపై రైతులు ఆందోళన చెందవద్దని, కుటుంబం యూనిట్‌గా రూ.2 లక్షల రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం తప్పక చేస్తుందని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోని తన నివాసంలో శనివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేస్తుందన్నారు. మొదటి విడత జాబితాలో పేర్లు లేని రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కొందరు రైతులు స్వయంగా తనను కలవడంతో ఏవోలు, తహసీల్దార్లు, సొసైటీ అధికారులు, బ్యాంకర్లతో మాట్లాడినట్లు చెప్పారు. జాబితాలో పేరు లేని రైతులు ఆధార్ కార్డు, పట్టాపాసు పుస్తకం తీసుకుని ఏఈవోల వద్దకు వెళ్లి సమాచారం తెలుసుకోవాలని సూచించారు. కుటుంబంలో ఇద్దరికి రూ.లక్షకు పైగా ఉంటే రెండో విడతలో, రూ.1.50లక్షలపై ఉంటే మూడో జాబితాలో వర్తిస్తుందని తెలిపారు. ధరణిలో పేరు సరి చేసుకునేందుకు కలెక్టర్ స్థాయిలో అవకాశం ఉందని చెప్పారు. రేషన్‌కార్డు లేని రైతుల వివరాలు ప్రభుత్వం సేకరించిందన్నారు. నాయకులు బాగారెడ్డి, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ తప్పనిసరి

ఖలీల్‌వాడి: ద్విచక్ర వాహనదారులు ఆగస్టు 15 తర్వాత హెల్మెట్ ధరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ కల్మేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్మెట్ తప్పక ధరించాలని సూచించారు. లేకపోతే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మైదానాన్ని తరలించే ప్రయత్నాన్ని అడ్డుకున్నాం



గత ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు పూర్తిగా అన్యాయం చేసింది. ఉన్న మైదానాన్ని సైతం తరలించడానికి కుట్రలు పన్నింది. ఒలింపిక్ సంఘం, క్రీడా సంఘాలు, ప్రజా, విద్యార్థి సంఘాలు ఐక్యం కావడంతోనే ప్రభుత్వం వెనక్కి తగ్గింది. గత కలెక్టర్ నారాయణరెడ్డి సైతం కలెక్టరేట్ మైదానానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో పోరాటం ఆగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు.

– బొబ్బిలి నర్సయ్య, ఒలింపిక్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



గతేడాది పాత కలెక్టరేట్ మైదానంలో ఫుట్‌బాల్ ఆడుతున్న రేవంత్‌రెడ్డి

బీఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాయం



బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలకు, క్రీడాకారులకు అన్యాయం చేసింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధిస్తే రూ.10 వేలు, రజత పతకం సాధిస్తే రూ. 5వేలు, కాంస్య పతకం సాధిస్తే రూ. 3 వేల చొప్పున అందించి ప్రోత్సహించారు. పాత కలెక్టరేట్ మైదానంలో కట్టడాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కూలగొట్టడానికి సిద్ధపడింది. సీఎం రేవంత్‌రెడ్డి స్పోర్ట్స్ లవర్ అయినందున ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు ఆడే విధంగా స్టేడియం నిర్మించాలి. కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. – సయ్యద్‌ఖైసర్, జాతీయ అథ్లెటిక్స్ గోల్డ్‌మెడలిస్టు

స్టేడియం నిర్మించాల్సిందే!

- పాత కలెక్టరేట్ మైదానంలో.. • 'సాక్షి' వేసిన అడుగుకు బాసటగా నిలుద్దాం • ఇదే స్ఫూర్తితో చేయి చేయి కలిపి ముందుకు సాగుదాం
- అరకొర వసతుల మధ్యే జిల్లాకు కీర్తి తెస్తున్నారు • రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రధాన వక్తలు
- హాజరైన వివిధ పార్టీల నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం/డొంకేశ్వర్: 'సాక్షి' వేసిన తొలి అడుగుకు.. మరిన్ని అడుగులు తోడయ్యాయి.. 'ఇందూరుకు స్టేడియం కావలెను' శీర్షికన ఈనెల 27న ప్రచురితమైన కథనం అందరినీ కదిలించింది.. స్టేడియం సాధించే బాధ్యతను అందరూ భుజాన వేసుకున్నారు.. చేయి చేయి కలుపుతూ.. నూతన స్టేడియం నిర్మించాలనే దృఢ సంకల్పంతో పోరాటాలు చేద్దామని.. పార్టీలకు అతీతంగా కలిసి కట్టుగా , ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుదామని ప్రతిజ్ఞ పూనారు.. శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి అద్భుత స్పందన లభించింది. వివిధ పార్టీల నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు, క్రీడాకారులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. స్టేడియం ఏర్పాటే ఎజెండాగా ముందుకు సాగుదామని ఏకతాటిపైకి వచ్చి పిలుపునిచ్చారు.. కలెక్టర్ గ్రౌండ్‌లో స్వయానా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ ఆడిన విషయాన్ని వక్తలు గుర్తు చేశారు. సీఎం స్పందించి ఇందూరులో క్రీడాస్టేడియాన్ని నిర్మింపజేయాలని ముక్తకంఠంతో కోరారు.



'సాక్షి' ఆధ్వర్యంలో నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, కోచ్‌లు, ప్రజా సంఘాల నాయకులు

కోచ్‌లను నియమించాలి



సీఎం రేవంత్‌రెడ్డి ఫుట్‌బాల్ లవర్. మన క్రీడా మైదానంలో ఫుట్‌బాల్ ఆడారు. నాకు తెలిసి ఇప్పటివరకు క్రీడారంగాన్ని అభివృద్ధి చేయడానికి మొట్టమొదటి సారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున రూ.390 కోట్ల వరకు కేటాయించారు. కోచ్‌లను సైతం నియమించబోతున్నారని తెలిసింది. కల్వకుర్తిలో పెద్ద స్టేడియం నిర్మించారు. నిజామాబాద్ జిల్లాలో ఒక్క స్టేడియం లేదు. అన్ని క్రీడలకు కోచ్‌లను నియమిస్తే క్రీడా రంగం మరింత అభివృద్ధి చెందుతుంది. – గొట్టిపాటి నాగరాజు, ఫుట్‌బాల్ కోచ్

కాంగ్రెస్‌తోనే స్టేడియం సాధ్యం



కాంగ్రెస్ పార్టీతోనే క్రీడలకు, క్రీడాకారులకు న్యాయం జరుగుతుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. కోచ్‌ల ఆధ్వర్యంలో క్రీడాకారులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వడం జరిగింది. కలెక్టరేట్ మైదానం నగరం నడి బొడ్డున ఉన్నందున ఇక్కడే పెద్ద ఎత్తున స్టేడియం నిర్మించాలి.

– ఎండీ ఫారుఖ్‌అలీ, కరాటే బ్లాక్‌బెల్టు

స్టేడియంతోనే ప్రయోజనం..



జిల్లా కేంద్రంలో స్టేడియం ఏర్పాటుకు కలెక్టర్ గ్రౌండ్ సరైంది. ఇక్కడ కళాభారతి కంటే స్టేడియం ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది. 'సాక్షి'దినపత్రిక పార్టీలకు అతీతంగా అందరినీ ఒకే వేదికపైకి తేవడం గొప్ప విషయం. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ద్వారా బీజేపీ ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు మా వంతుగా కృషి చేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించాలి. – న్యాలం రాజు, బీజేపీ డిప్యూటీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్

'సాక్షి' ప్రయత్నం అభినందనీయం



సాక్షి ఆధ్వర్యంలో క్రీడాకారుల కోసం మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం అభినందనీయం. జిల్లాలో క్రీడాకారులు ఎదగాడానికి ఆర్థిక సహాయం అందడం లేదు. జిల్లాలోని ప్రతి ఫ్యాక్టరీ ట్యాక్స్ మినహాయింపు కోసం జీవో 80 ప్రకారం వివిధ క్రీడలను దత్తత తీసుకుని శిక్షణ ఇవ్వవచ్చు. – బాగారెడ్డి, సెపక్‌తక్రా కోచ్

ప్రోత్సహిస్తే మరింత రాణిస్తాం



నేను బాక్సింగ్‌లో జాతీయ స్థాయికి ఎదిగాను. నిత్యం డీఎస్ఏ మైదానంలో కోచ్ శంషోద్దీన్ సమక్షంలో సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నా శిక్షణ తీసుకుంటున్నా. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించాలి. అప్పుడే మరింత మంది క్రీడాకారులు తయారవుతారు.

– సాదత్‌ఫూజజామా, బాక్సింగ్ క్రీడాకారిణి

త్వరలో సీఎంను కలుస్తాం..



కలెక్టర్ గ్రౌండ్‌ను పరిరక్షించుకోవడానికి అందరం కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వం ఇక్కడ కళాభారతిని నిర్మించడానికి ప్రయత్నాలు చేసింది. జిల్లాలో అనుభవజ్ఞులైన నాయకులు ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కలెక్టర్ గ్రౌండ్‌ను ఎక్కడికీ పోనియ్యం. నిర్మిస్తున్న కళాభారతి భవనాన్ని కూల్చేస్తాం. ఈ స్థలాన్ని పూర్తిగా స్టేడియంగా మార్చే వరకు దీక్ష తీసుకుంటాం. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్‌ల దృష్టికి తీసుకెళ్తాం. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ తీసుకుని కలుస్తాం. కలెక్టర్ గ్రౌండ్‌ను పూర్తి స్టేడియంగా మార్చాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతాం. పార్టీలకతీతంగా పరిరక్షణ కమిటీని ఏర్పాటు చేసుకుని వచ్చిన నిధులతో 400మీ. ట్రాక్‌తో పాటు అన్ని సౌకర్యాలతో స్టేడియం నిర్మించుకుందాం. అందరినీ కలుపుకొని త్వరలో ఒక ర్యాలీ తీద్దాం. ముబారక్‌నగర్‌లో 106 సర్వే నంబర్‌లో ఉన్న క్రీడా స్థలం పరిరక్షణ కొరకు నిధులు తెచ్చుకుని కంచె వేద్దాం. నాగారంలోని రాజారాం స్టేడియంలో వసతుల కల్పనకు నిధులు కావాలని ప్రభుత్వాన్ని కోరుదాం. 'సాక్షి'దినపత్రిక ఇలాంటి అంశాన్ని తీసుకుని స్టేడియం కోసం అందరినీ ఒక వేదికపైకి తేవడం అభినందించదగ్గ విషయం. – కేశ వేణు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు

పీడీఎస్‌యూ నుంచి పోరాడుతాం



నాగారంలోని రాజారాం స్టేడియం చాలా దూరం ఉంది. క్రీడాకారులకు సరైన స్థలాలు లేవు. సిటీ సెంటర్‌లో ఉన్న కలెక్టర్ గ్రౌండ్‌ను ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి. స్టేడియం కోసం పీడీఎస్‌యూ తరఫున కూడా ప్రత్యేకంగా పోరాడుతాం.

– రాజేశ్వర్, పీడీఎస్‌యూ, జిల్లా ఉపాధ్యక్షుడు

అరకొర వసతుల మధ్య శిక్షణ



నేను 1999–2004 మధ్యలో ఆర్చరీలో ఎన్నో పతకాలు తెచ్చాను. అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నాగారంలోని రాజారం స్టేడియంలో ఆర్చరీలో శిక్షణ ఇస్తున్నాను. స్టేడియంలో సరైన వసతులు లేకున్నా, ఆటల మీద ఉన్న మక్కువతోనే శిక్షణ ఇస్తున్నారు.

– మద్దుల మురళి, ఖేలో ఇండియా ఆర్చరీ కోచ్

గ్రౌండ్‌చిన్నది.. జిల్లా క్రీడాకారుల చరిత్ర పెద్దది



మన డీఎస్ఏ గ్రౌండ్ చాలా చిన్నది.. అయినా జిల్లాలో క్రీడాకారులను తయారు చేసిన చరిత్ర చాలా పెద్దది. హాకీ నుంచి యెండల సౌందర్య, బాక్సింగ్ నిఖత్, హుస్సాముద్దీన్ ఇలా ఎంతో మంది క్రీడాకారులను వివిధ రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయస్థాయికి ఎదిగేలా చేసింది. మన జిల్లాలోనే క్రీడా మైదానం లేదు. ఫుట్‌బాల్, ఉషు, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, తదితర విభాగాల్లో సీనియర్ క్రీడాకారులే క్రీడల మీద ప్రేమతో సొంతగా కోచింగ్ ఇస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రోత్సాహకంగా నగదు సహాయం చేస్తే ఎంతో మంది క్రీడాకారులు తయారు అవుతారు.

– మీసాల ప్రశాంత్, కబడ్డీ కోచ్

సీఎం దృష్టికి వెళ్లేలా చేద్దాం..



నగరంలో మంచి స్టేడియం అవసరమని 'సాక్షి'దినపత్రిక ఈ కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం. సరైన గ్రౌండ్‌లు లేకుండానే జిల్లా నుంచి ఎందరో అంతర్జాతీయ స్థాయికి వెళ్లారు. జిల్లాకు పెద్దగా ఉన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్టేడియం అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలి. – శ్రీనివాస్‌గౌడ్, బీసీ యువజన సంఘం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు

ఎప్పటి నుంచో ఆకాంక్ష



జిల్లా కేంద్రంలో స్టేడియం ఉండాలన్న ఆకాంక్ష ఎప్పటినుంచో ఉంది. ఏ పార్టీ అధికారంలో ఉన్నా అది నెరవేరడం లేదు. కలెక్టర్ గ్రౌండ్‌లో స్టేడియం తెచ్చే వరకు రాజకీయ పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెద్దాం. ప్రజా, యువజన, విద్యార్థి సంఘాలు ఏకమై పోరాటం చేయాలి.

– ఎనుగందుల మురళి, బీఆర్ఎస్ నగర కార్యదర్శి

సీఎం సార్.. క్రీడా మైదానాన్ని నిర్మించండి



జిల్లాలో మైదానాలు లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. అరకొర వసతుల మధ్య అవస్థలు పడుతూ శిక్షణ తీసుకుంటున్నారు. ప్రభుత్వ కోచ్‌లు లేరు. సీఎం రేవంత్‌రెడ్డి సార్ జిల్లాలో అన్ని రకాల సౌకర్యాలతో స్టేడియాన్ని నిర్మించి క్రీడాకారులకు భవిష్యత్తు ఇవ్వండి.

– గుగులోత్ సౌమ్య, భారత ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారిణి

కేవీలో ఒకటో తరగతి అదనపు సెక్షన్ మంజూరు

- ఎంపీ అర్వింద్‌కు వీఎంసీ కమిటీ, తల్లిదండ్రుల ధన్యవాదాలు

సుభాష్‌నగర్: జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయంలో 1వ తరగతికి అదనపు సెక్షన్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంపై ఎంపీ అర్వింద్ ధర్మపురి ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం వీఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు అదనపు సెక్షన్ మంజూరు చేయాలని ఎంపీని కోరిన విషయం తెలిసిందే. వారి విజ్ఞప్తి మేరకు ఇదే విషయమై కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఎంపీ కోరగా, ఆయను సానుకూలంగా స్పందించి ఇటీవల ఉత్తర్వులిచ్చారు. దీంతో సంబంధిత విద్యాలయ అధికారులు ఈమేరకు నోటిఫికేషన్ విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను మొదలు పెట్టారు. అదనపు సెక్షన్ అడ్మిషన్ల కోసం 132 దరఖాస్తులు స్వీకరించామని, కేంద్రీయ విద్యాలయ నియమ నిబంధనలకు అనుగుణంగా ఈనెల 22న లాటరీ పద్ధతిన అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించామని విద్యాలయ అధికారులు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోందని, వారం రోజుల్లో తరగతులు ప్రారంభమవుతాయని అన్నారు. ప్రతిపాదనలు పంపడంలో ఆలస్యమైనప్పటికీ, అదనపు సెక్షన్ మంజూరుకు సహకరించినందుకు వీఎంసీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీ అర్వింద్ ధర్మపురికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం

నవీపేటలోని మేకల సంత



కిక్కిరిసిన మేకల సంత

- రూ.3 కోట్లకుపైగా లావాదేవీలు

నవీపేట: నవీపేటలో శనివారం జరిగిన మేకల సంత వ్యాపారులు, వినియోగదారులతో కిక్కిరిసిపోయింది. సంతతో పాటు బస్టాండ్ ప్రాంగణం, జీపీ ముందు గల పార్కింగ్ ప్రదేశంలో విక్రయాలు జరిగాయి. ఆదివా రం జిల్లా కేంద్రంలో జరిగే ఊర పండుగ, గ్రామాల్లో బోనాల వేడుకలు, వన భోజనాల సందడితో క్రయవిక్రయాలు రెట్టింపయ్యా యి. సంతలో రూ.3 కోట్లకు పైగా లావాదేవీలు జరిగినట్లు వ్యాపారులు పేర్కొన్నారు. వర్షానికి సంత ప్రాంగణం బురదమయంగా మారడంతో వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు.

నేడు ఊర పండుగ

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ నగరంలో ఆదివారం ఊర పండుగ నిర్వహణకు సర్వ సమాజ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎనిమిది దశాబ్దాల క్రితం నగరంలో ప్లేగు వ్యాధి ప్రబలిన నేపథ్యంలో ఈ ఊర పండుగ ప్రారంభమైంది. నాటి నుంచి నేటి వరకు వివిధ కులాల వారు కమిటీగా ఏర్పడి పండుగను ఘనంగా నిర్వహిస్తున్నారు. నగరంలోని 14 చోట్ల కొలువైన గ్రామ దేవతలకు సంబంధించి ఊరేగింపు ఖిల్లా శారదాంబ గద్దె నుంచి ప్రారంభమవుతుంది. ఉదయం నుంచి ఊరేగింపు కార్యక్రమాలు మొదలవుతాయి. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. దీనికి సంబంధించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఊరపండుగకు సిద్ధమైన గ్రామదేవతల విగ్రహాలు

ట్రాఫిక్ మళ్లింపు

ఖలీల్‌వాడి: ఊర పండుగ నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ మళ్లిస్తున్నట్లు సీపీ కల్మేశ్వర్ శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఊర పండుగ సందర్భంగా ఊరేగింపు ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గడి (గోల్ హనుమాన్), వినాయక్ నగర్, దుబ్బా (జీజీ కాలేజ్) వరకు ఉంటుందని చెప్పారు. ఈ మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు.

- బోధన్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు అర్సపల్లి, న్యూ కలెక్టరేట్, జీజీ కాలేజీ, ఫ్లైఓవర్, మీదుగా బస్టాండ్ చేరుకోవాలి. భారీ వాహనాలు న్యూ కలెక్టరేట్ బైపాస్ మీదుగా మాధవ్ నగర్ వెళ్లాలి.
- బస్టాండ్ నుంచి బోధన్ వెళ్లే బస్సులు రైల్వే స్టేషన్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, బోధన్ బస్టాండ్ మీదుగా వెళ్లాలి.
- హైదరాబాద్ నుంచి బోధన్ వెళ్లే వాహనాలు మాధవ్ నగర్ బైపాస్, న్యూ కలెక్టరేట్, అర్సపల్లి మీదుగా వెళ్లాలి.
- ఖిల్లా చౌరస్తా నుంచి సిర్నాపల్లి గాడి (గోల్ హనుమాన్) మార్గంలో రాకపోకలు సాగించకుండా ఇతర మార్గాలను ఎంచుకోవాలి.

క్లుప్తంగా

కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాలో టీజీఆర్టీసీ కార్గోలో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ట్రాఫిక్‌ ఆర్టీసీ మేనేజర్‌ సదాశివ్‌ శనివారం తెలిపారు. ఉమ్మడి జిల్లా వాసుల వస్తువులను ఇతర ప్రాంతాలకు బుక్‌ చేయడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వస్తువులను వినియోగదారులకు చేరవేసేందుకు మండల, పట్టణ కేంద్రాల్లో కార్గో ఏజెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుదారులు గ్రామ, మండల స్థాయిలో రూ.1000, జిల్లా స్థాయిలో రూ.5,000 సెక్యూరిటీ డిపాజిట్‌ చేయాల్సి ఉంటుందని, పూర్తి వివరాలకు, ఆర్మూర్‌ డిపో 73968 89496, బోధన్‌ 90142 96638, నిజామాబాద్‌ ఒకటో డిపో 91542 98727, నిజామాబాద్‌ రెండో డిపో 73968 89496, బాన్సువాడ 91542 98729, కామారెడ్డి డిపో 91542 98729, రీజినల్‌ కార్యాలయం 86399 63647 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు ఏసీపీలకు అడిషనల్‌ ఎస్పీలుగా పదోన్నతి

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో ఏసీలుగా పని చేస్తున్న ఇద్దరికి అడిషనల్‌ ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ శనివారం స్పెషల్‌ చీఫ్‌ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్మూర్‌ ఏసీపీ బస్వారెడ్డి, సీసీఎస్‌ ఏసీపీ కిషన్‌కు అడిషనల్‌ ఎస్పీలుగా పదోన్నతిలభించింది.

ఉచిత దంత వైద్యశిబిరం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని డాక్టర్‌ శ్రీనునాయక్‌ డెంటల్‌ ఆస్పత్రిలో శనివారం ఆస్పత్రి 23వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శ్రీనునాయక్‌ ఆధ్వర్యంలో రోగులకు దంత వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

కామారెడ్డి అర్బన్‌ : నేషనల్‌ అచీవ్‌మెంట్‌ సర్వేలో భాగంగా 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించడానికి శనివారం స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అకడమిక్‌ మోటివేటర్‌ వేణుశర్మ కేంద్ర విద్యా పరిశోధన శిక్షణ వివరాలను వివరించారు. జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించాలన్నారు. డీఆర్పీలు హరిప్రసాద్‌, ఆనందరావు పాల్గొన్నారు.

మక్క రైతు ఆశలపై ముసురు

- వర్షాల కారణంగా దెబ్బతింటున్న పంట
- తెగుళ్లు అధికంగా సోకే ప్రమాదం
- దిగుబడిపై ఆశలు వదులుకుంటున్న రైతులు!



వేంపల్లిలోని మక్క తోటలో నిలిచిన వర్షపు నీరు

బాల్కొండ: మక్కజొన్న సాగు చేసిన రైతుల ఆశలు అడియాసలయ్యే పరిస్థితి నెలకొంది. గత వారం రోజులుగా ఆగకుండా ముసురు కురుస్తుండడంతో మక్క పంట దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేలలో తేమశాతం పెరిగి పంటకు తెగుళ్లు వ్యాపిస్తాయని అంటున్నారు. సోయాను కాదని ప్రస్తుత ఏడాది రైతులు మక్క సాగు చేశారు. ప్రస్తుతం పంట చుంచు దశలో ఉంది. ముందస్తుగా సాగుచేసిన మక్క పంట కంకులువేసే దశలో ఉండగా, సమపాలల్లో ఉష్ణోగ్రత లేకపోతే పంట దెబ్బ తింటుందని రైతులు అంటున్నారు. నేలలో తేమ శాతం ఎక్కువైతే పంటకు ఎండు తెగులు వ్యాపించి నిలువుగా ఎండిపోతుంది. అంతే కాకుండా వేరుకుళ్లు తెగులు వ్యాపిస్తుంది. దీంతో ప్రస్తుత సంవత్సరం సాగుచేసిన మక్క పంటపై రైతులు ఆశలు వదులుకుంటున్నారు. మరో వారం రోజులు ఇలాంటి పరిస్థితి ఉంటే మక్క పంటను తొలగించాల్సి వస్తుందని రైతులు అంటున్నారు.

ప్రస్తుత సంవత్సరం పెరిగిన సాగు

ప్రస్తుత సంవత్సరం ఖరీఫ్‌ సీజన్‌లో మక్క సాగు అధికంగా పెరిగింది. గత కొన్నాళ్లుగా మక్కపంటకు బదులుగా రైతులు అధికంగా సోయాను సాగు చేశారు. కానీ గతేడాది సోయా దిగుబడి అమాంతం తగ్గడంతో రైతులు మక్కసాగు వైపు దృష్టి సారించారు. దీంతో 80 శాతానికి మక్క సాగు పెరిగింది. ప్రారంభం నుంచి ఆరు తడి పంటలకు అనువైన వాతావరణం ఉండటం, వర్షాలు మోతాదుగా కురువడంతో మక్క పంట ఏపుగా పెరగడంతో మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. అయితే, వారం రోజుల నుంచి కురుస్తున ముసురు మక్క పంటను దెబ్బ తీసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పంట దెబ్బతింటుంది



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మక్క పంట పూర్తిగా దెబ్బ తింటుంది. మక్క పంటకు అధిక వర్షం మంచి దికాదు. చుంచు దశలో ఉన్న మక్కలు చేతికి రాకుండాపోతాయి. ప్రస్తుత సంవత్సరం మక్క పంటను అధికంగా సాగు చేశాం. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– నడ్కుడ నర్సయ్య, రైతు


ఆయకట్టుకు భరోసా!

- ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద
- ఈ సీజన్‌లో తొలిసారి 35 వేల క్యూసెక్కులు దాటిన ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి వరద కొనసాగుతోంది. ప్రాజెక్ట్‌లోకి శనివారం సాయంత్రానికి 35 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికం. దీంతో ప్రాజెక్ట్‌ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. జలాశయంలో నీటి నిల్వ 32 టీఎంసీలకు చేరుకుంది. ప్రస్తుత సంవత్సరం జూలై 15 వరకు వరదలు లేక ప్రాజెక్ట్‌ వెలవెలబోయింది. దీంతో వానాకాలం సీజన్‌లో పంటలకు కాలువల ద్వారా నీటి విడుదల చేపడుతారో లేదోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందారు. ప్రస్తుతం వర్షాలతో ప్రాజెక్ట్‌లోకి వరదలు రావడంతో ఆయకట్టుకు నీరు అందుతుందని వారు భరోసా వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గరిష్టంగా 35 వేల క్యూసెక్కులు, కనిష్టంగా 17 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చింది. వారం వ్యవధిలో 15 టీఎంసీల నీరు చేరింది. ప్రస్తుతం ఎగువ నుంచి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు పూర్తి భరోసా రావాలంటే మరో 25 టీఎంసీల నీరు రావాలి. ఆగస్టు 15 వరకు కూడా కాలువల ద్వారా నీటి విడుదల చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. దీంతో ప్రస్తుతం ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేకుండా పోయింది.

వేగంగా పెరుగుతున్న నీటిమట్టం

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు కొనసాగుతుండటంతో ప్రాజెక్ట్‌ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్‌ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 397 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1074.3(32 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు పేర్కొన్నారు.



ఎస్సారెస్పీలో ప్రస్తుత నీటిమట్టం

అవగాహన సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

నిజామాబాద్‌రూరల్‌: విద్యార్థులు విషయాన్ని అవగాహన చేసుకుని చక్కని వాక్య నిర్మాణంతో, స్పష్టమైన భావంతో రాయగలగాలని.. అందుకు భాషోపాధ్యాయులు చేసే కృషి కీలకమని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్‌ అన్నారు. శనివారం గూపన్‌పల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను సందర్శించిన డీఈవో.. జాతీయ సాధన సర్వే శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. తెలుగు, ఇంగ్లిష్‌ స్కూల్‌ అసిస్టెంట్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. నవంబర్‌లో నిర్వహించే జాతీయ సాధన సర్వే పరీక్షలో జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా, తెలంగాణ రాష్ట్రం జాతీయస్థాయిలో ఉన్నత స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ధారాళంగా చదవడం, అవగాహన చేసుకోవడం, ఏ స్వరూపంలో ప్రశ్నలు వచ్చినా సమాధానాలు ఇవ్వగలగడం, తరగతికి నిర్దేశించిన అభ్యాసన ఫలితాలను సాధించడం లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ శకుంతలాదేవి, అకాడమిక్‌ మానిటర్‌ అధికారి జీవన్‌, స్టేట్‌ రీసోర్స్‌ పర్సన్‌లు ఘనపురం దేవేందర్‌, డి శారద, అరవింద్‌, చిన్నయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్‌

విద్యుత్‌ సిబ్బంది సేవలు అభినందనీయం

నిజామాబాద్‌నాగారం: వర్షాలు విస్తారంగా కురుస్తున్నప్పటికీ వినియోగదారులకు ఎక్కడా ఇబ్బందులు కలుగకుండా విద్యుత్‌ సరఫరా చేస్తున్న అధికారులను, సిబ్బందిని సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అభినందించారని నిజామాబాద్‌ సర్కిల్‌ సూపరింటెండింగ్‌ ఇంజినీర్‌ ఆర్‌ రవీందర్‌ శనివారం తెలిపారు. సమస్యలు ఉన్న చోట విద్యుత్‌ సిబ్బంది తక్షణమే స్పందించి విద్యుత్‌ సరఫరాను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు సర్కిల్‌ పరిధిలో గడిచిన నాలుగు నెలల్లో 1300 వంగిన, 260 తుప్పు పట్టిన స్తంభాలు, వదులుగ ఉన్న 11 కిలో మీటర్ల విద్యుత్‌ లైన్లు, 510 స్టే వైర్లు మార్చామని వివరించారు. కొంతమంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విద్యుత్‌ శాఖకు సహకారం అందిస్తున్నారన్నారు. విద్యుత్‌ అంతరాయం, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని, మరింత నాణ్యమైన విద్యుత్‌ సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు.

సొసైటీల నిర్లక్ష్యం..రుణమాఫీకి 156 మంది దూరం

సిరికొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా 156 మంది రైతులు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీకి అర్హులు కాలేకపోయారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రకటించిన కటాఫ్‌ తేదీ డిసెంబర్‌ 9కి ముందే పంట రుణాలు తీసుకున్నప్పటికీ ఆ రై తుల రుణాల వివరాలను ఆన్‌లైన్‌ చేయకపోవడంతో వారు రుణమాఫీ పొందలేకపోతున్నారు. సిరికొండ పీఏసీఎస్‌లో 132, తూంపల్లి పీఏసీఎస్‌లో 24 మంది రుణాల వివరాలను స్థానిక సిబ్బంది సకాలంలో ఆన్‌లైన్‌ చేయకపోవడంతో రుణమాఫీ పొందలేకపోతున్నామని పలువురు రైతులు వాపోయారు.సిబ్బందిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అర్థశాస్త్రంతోనే వనరుల నిర్వహణ

తెయూ(డిచ్‌పల్లి): మారుతున్న కాలంలో అర్థశాస్త్రానికి సమాజంలో ఎంతో విలువ, గుర్తింపు ఉందని తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజీ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి అన్నారు. శనివారం నిర్వహించిన తెయూ అర్థశాస్త్ర విభాగం ఫైనలియర్‌ విద్యార్థులు వీడ్కోలు సమావేశానికి ప్రిన్సిపాల్‌ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యూనివర్సిటీలో విద్య నేర్చుకోవడం సమాజంలో బాధ్యత గల పౌరులుగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు. వనరుల నిర్వహణ, పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అంతర్జాతీయ వ్యాపారం వంటి విషయాలను అర్థం చేసుకోవాలంటే అర్థశాస్త్రంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్థశాస్త్ర విభాగాధిపతి ఏ పున్నయ్య మాట్లాడుతూ.. తెయూ పరిధిలో అర్థశాస్త్ర విభాగంలో 200 మంది పీజీ విద్యార్థులు, పదిమంది పరిశోధక విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. అర్థశాస్త్రంలో విద్యనభ్యసించిన విద్యార్థులు అనేకమంది డిగ్రీ కాలేజీ లెక్చరర్లుగా, జూనియర్‌ కాలేజీ లెక్చరర్లుగా, బ్యాంకు ఆఫీసర్లుగా అనేక ప్రభుత్వ, ప్రైవేట్‌ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని తెలిపారు. సీనియర్‌ ప్రొఫెసర్‌ కే రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 18 వసంతాలు పూర్తి చేసుకున్న అర్థశాస్త్ర విభాగం తనతో ప్రారంభం కావడం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. అనేక మంది విద్యార్థులు పరిశోధనలు పూర్తి చేసి పీహెచ్‌డీ డాక్టరేట్‌ అవార్డు సాధించినట్లు తెలిపారు. ఫైనలియర్‌ విద్యార్థులు అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బీవోఎస్‌ చైర్మన్‌ టీ సంపత్‌, అధ్యాపకులు స్వప్న, శ్రీనివాస్‌, దత్తాహరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెయూ ప్రిన్సిపాల్‌ ఆరతి

అవయవదాతల అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో జరిపించాలి

బోధన్‌: అవయవదాతల అంత్యక్రియలను తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం తరహాలో అధికారిక లాంఛనాలతో జరిపించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహను తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం రాష్ట్ర ప్రతినిధుల బృందం కోరింది.ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మంత్రిని శనివారం కలిసి విన్నవించినట్లు బోధన్‌కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, అవయవ శరీర దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కాట్రగడ్డ భారతి తెలిపారు. అవయదానం చేసిన వారి కుటుంబాలను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం తరహాలో జాతీయ పర్వదినాల్లో సన్మానించాలని కోరామని,మరణం ఏ సమయంలోనైనా సంభవించొచ్చని,ప్రతి వైద్య కళాశాలలో పార్థివ దేహాలను 24గంటలపాటు స్వీకరించి భద్రపర్చే విధంగా ఆదేశాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. మంచి అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారని మంత్రి అభినందించారని ఆమె తెలిపారు. ఆగస్టు రెండో వారంలో గాంధీ మెడికల్‌ కళాశాలలో నిర్వహించే ప్రపంచ అవయదాన దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యేందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మంత్రిని కలిసిన వారిలో తనతోపాటు అఖిల భారత అవయవ, శరీర దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరి సీతామహాలక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుప్రకాశ్‌ తదితరులు ఉన్నారని తెలిపారు.



మంత్రితో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రతినిధులు

టీ అండ్‌ డీ పనులను పూర్తి చేయాలి

నిజామాబాద్‌నాగారం: టీ అండ్‌ డీ (ట్రాన్స్‌మిషన్‌ అండ్‌ డిస్ట్రిబ్యూషన్‌) పనులు, కొత్త సర్వీసుల మంజూరుకు అవసరమైన మెటీరియల్‌ అందుబాటులో ఉందని, అవసరమైన పనులను వేగంగా పూర్తి చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్‌ నిజామాబాద్‌ సర్కిల్‌ చీఫ్‌ ఇంజినీర్‌ తిరుమలరావు శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. టీ అండ్‌ డీ పనులకు సంబంధించి వంగిన విద్యుత్‌ స్తంభాలను సరిచేయడం, డబుల్‌ జంపరింగ్‌, చెడిపోయిన ఇన్సులేటర్ల మార్పు, కాలం చెల్లిన స్టే రాడ్‌/స్టే వైర్లు మార్చడం, వంగిన క్రాస్‌ ఆర్మ్‌ను సరిచేయడం, లూజ్‌ లైన్లను సరి చేయడం, కాలంచెల్లిన, చెడిపోయిన ఏబీ స్విచ్‌లను రిపేర్‌ చేయాలని సూచించారు. అలాగే ఎర్తింగ్‌ సరి చేయడం, ఫ్యూజ్‌ క్యారియర్స్‌ ఫ్యూజ్‌ బాక్సుల, ఫ్యూజ్‌ వైరు మార్పు, టీ రేజర్‌ వేసి రోడ్డు క్రాసింగ్స్‌ దగ్గర లైన్‌ ఎత్తు పెంచడం తదితర పనులను చేప ట్టేందుకు అవసరమైన సామగ్రి స్టోర్‌లో అందుబాటులో ఉందని వివరించారు. అలాగే కొత్త వ్యవసాయ కనెక్షన్లు, గృహ కనెక్షన్లు, గృహేతర సర్వీసులకు సంబంధించి మీటర్లు తదితర సామగ్రి మెటీరియల్‌ సిద్ధంగా ఉందని తెలిపారు. వినియోగదారులకు 24 గంటలపాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌ శాఖ సిద్ధంగా ఉందని తెలిపారు.

బీఎన్‌రావు మెమోరియల్‌ ట్రస్ట్‌ సేవలు అభినందనీయం

- రిజిస్ట్రార్‌ ప్రొఫెసర్‌ యాదగిరి
- వర్సిటీ లైబ్రరీకి పోటీ పరీక్షల పుస్తకాలు వితరణ

తెయూ(డిచ్‌పల్లి): పేద విద్యార్థులకు అండగా బీఎస్‌ రావు మెమోరియల్‌ ట్రస్ట్‌ అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ ఎం యాదగిరి అన్నారు. టీజీపబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించే గ్రూప్‌–1 మెయిన్స్‌లో తెయూ విద్యార్థులు అధిక సంఖ్యలో విజయం సాధించాలని రిజిస్ట్రార్‌ ఆకాంక్షించారు. కరీంనగర్‌కు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్‌ వైద్యుడు, బీఎస్‌రావు మెమోరియల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ బి నరేందర్‌రావు శనివారం యూనివర్సిటీ సెంట్రల్‌ లైబ్రరీకి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను విరాళంగా అందజేశారు. గ్రూప్‌–1 ప్రిలిమ్స్‌ పాసై మెయిన్స్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన జనరల్‌ స్టడీస్‌, పోటీపరీక్షలకు ఉపయోగపడే విలువైన పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రావు మాట్లాడుతూ.. పేదరికం నుంచి విముక్తి కావడానికి చదువు ఒక్కటే ఆయుధమని అన్నారు. చదువుతూనే పేదరికాన్ని జయించాలని పిలుపునిచ్చారు. అన్ని దానాల కంటే విద్యా దానం మెరుగైనదని, విద్యకు దూరమవుతున్న పేదలను బీఎన్‌రావు ట్రస్టు ఆదుకుంటుందని తెలిపారు. విద్యార్థులు తమ ట్రస్ట్‌ సేవలను సద్వినియోగం చేసుకొని భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. వర్సిటీ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, అకడమిక్‌ ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ ఘంటా చంద్రశేఖర్‌, లైబ్రేరియన్‌ సత్యనారాయణ, కాంపిటీటీవ్‌ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ రమణాచారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్‌ నరేందర్‌రావును రిజిస్ట్రార్‌ ఘనంగా సన్మానించారు.



ట్రస్ట్‌ వ్యవస్థాపకులు డాక్టర్‌ బి నరేందర్‌రావును సన్మానిస్తున్న తెయూ రిజిస్ట్రార్‌ యాదగిరి

నాలుగు రోజులుగా అడవిలో వృద్ధురాలు

నిజామాబాద్‌ రూరల్‌: నిజామాబాద్‌ జిల్లా రూరల్‌ మండలంలోని మల్లారం గ్రామ అటవీ ప్రాంతంలో నాలుగు రోజులుగా తిండితిప్పలు లేకుండా పడి ఉన్న గుర్తుతెలియని వృద్ధురాలిని గ్రామానికి చెందిన పశువుల కాపరులు శనివారం గుర్తించారు. వారు 108 అంబులెన్స్‌కు ఫోన్‌ చేయగా రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పోలీసులు వచ్చి ఆమెను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వృద్ధురాలికి 70 నుంచి 75 ఏళ్ల వయస్సు ఉటుందని, ఆమె ఎక్కడి నుంచి వచ్చిందనే వివరాలు చెప్పలేకపోందని ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపారు. వద్ధురాలిని ఎవరైనా గుర్తిస్తే ఫోన్‌ 8712659849 నంబర్‌కు లేదా రూరల్‌ పోలీస్‌ స్టేషన్లో సంప్రదించాలని ఆయన కోరారు.



అడవిలో పశువుల కాపరులు గుర్తించిన వృద్ధురాలు

మద్యం సేవిస్తూ.. సెల్ఫీలు తీసుకుంటూ..

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో పెరుగుతుండగా, ప్రాజెక్టును సందర్శించేందుకు పర్యాటకులు తరలిస్తున్నారు. అయితే, యువకులు నీటి అంచు వరకు వెళ్తూ అక్కడే మద్యం సేవించడంతోపాటు సెల్ఫీలు తీసుకుంటున్నారు. గతంలో ప్రమాదవశాత్తు నీటిలోకి జారి పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేదు. పర్యాటకులు ప్రాజెక్టు లోపలి వరకు వెళ్లకుండా అడ్డుకునే వారు కరువయ్యారు. ప్రాజెక్టు ఆనకట్టపై, ప్రాజెక్ట్‌ నీటి అంచున మద్యం సేవిస్తున్నా పట్టించుకునే వారు లేరు. ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించక జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సెల్ఫీ తీస్తున్న యువకుడి చేతిలో బీరు సీసా

క్రైం కార్నర్‌


బాలుడి అదృశ్యం



సాయిరాం

బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలకు చెందిన విద్యార్థి అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మోస్రా మండల కేంద్రానికి చెందిన బొంబాయి సాయిరాం పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అయితే, సాయిరాం కనిపించడం లేదని పాఠశాల నుంచి తల్లిదండ్రులకు సమాచారం అందడంతో వారు పాఠశాలకు చేరుకున్నారు. పలుచోట్ల ఆరా తీసినప్పటికీ సాయిరాం ఆచూకీ లభించకపోవడంతో సదరు పాఠశాల ప్రిన్సిపాల్‌తోపాటు బాలుడి తల్లిదండ్రులు శేఖర్‌, విజయలక్ష్మి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, రెండు బృందాలు బాలుడి ఆచూకీని గుర్తించేందుకు గాలిస్తున్నాయని సీఐ తెఇపారు. బాలుడు పాఠశాల నుంచి బయటికి వెళ్లినట్లు సీసీ పుటేజీలో ఉందన్నారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

దొరికిన పర్సు అప్పగింత



ధర్పల్లి: రోడ్డుపై పడిపోయిన పర్స్‌ను పోలీసులకు అప్పగించి ఓ యువకుడు నిజాయితీ చాటుకున్నాడు. ఈ సంఘటన ధర్పల్లి మండలంలో శనివారం చోటుచేసుకుంది. దమన్నపేట్‌ గ్రామానికి చెందిన కల్ల సిసింద్రీ రామడుగు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, రోడ్డుపై పర్సు దొరకడంతో ధర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. పర్సులో రూ.6 వేల నగదుతోపాటు విలువైన కార్డులు ఉన్నాయి. పోలీసులు బాధితుడిని స్టేషన్‌కు పిలిపించి పర్స్‌ను అప్పగించారు. దొరికిన పర్సును పోలీస్‌స్టేషన్‌లో అప్పగించిన సిసింద్రీని ఎస్సై విక్రమ్‌తోపాటు పలువురు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేల్పూర్‌: నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను బైక్‌ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని వెంకటాపూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసకుంది. ఎస్సై వినయ్‌కుమార్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సంతోష్‌(45) తన బైక్‌పై గ్రామ సమీపంలోని ఆర్డర్‌మెస్‌కు కోళ్ల సరఫరా చేసి, తిరిగి వస్తుండగా రోడ్డుపై గొండల మహిపాల్‌ అనే వ్యక్తి నిలిపి ఉంచిన ట్రాక్టర్‌ను బైక్‌ ఢీకొన్నది. ఈ ఘటనలో తలకు బలమైన దెబ్బలు తగలడంతో సంతోష్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

బోధన్‌రూరల్‌: మండలంలోని మావంది కలాన్‌ గ్రామానికి చెందిన సూర్య సురేశ్‌ (35) అనే వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందగా, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు రూరల్‌ ఎస్సై నాగనాథ్‌ శనివారం తెలిపారు. 25వ తేదీన రాత్రి ఇంట్లో పడుకున్న సురేశ్‌ మరుసటి రోజు తెల్లవారుజామున 5.30గంటలకు మృతి చెందాడు. అయితే, సురేశ్‌ మృతిపై అతడి అక్క పోశవ్వ అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సురేశ్‌ భార్య కావ్యపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తల్లీ.. ఈ కష్టం ఎవరికీ రావొద్దు..

- యువతికి కాలేయ సమస్య
- ఇప్పటికే రూ. 14 లక్షలు ఖర్చు
- అయినా కుదుటపడని ఆరోగ్యం
- కాలేయంలో కొద్దిభాగం ఇచ్చేందుకు ముందుకొచ్చిన సోదరుడు
- రూ. 30లక్షలు సమకూరితేనే శస్త్రచికిత్స
- దాతల కోసం ఎదురుచూస్తున్న కుటుంబం



కాలేయ వ్యాధితో బాధపడుతున్న షేక్‌ అజియా

భిక్కనూరు : చిన్నవయస్సులోనే ఆ యువతికి పెద్ద కష్టం వచ్చింది. కాలేయం పూర్తిగా దెబ్బతిని కాలేయ మార్పిడి చికిత్సకు దాతల కోసం ఎదురుచూస్తోంది. కళ్లముందు తన తోబుట్టువు కాలేయవ్యాధితో బాధపడుతుంటే చూడలేక.. తన కాలేయంలో కొంతభాగం ఇచ్చేందుకు ముందుకొచ్చాడు ఆమె అన్న.. అయినప్పటికీ కాలేయ సర్జరీ చేయించుకునేందుకు డబ్బుల్లేక కుమలిపోతోంది ఓ కుటుంబం.. వివరాల్లోకి వెళ్తే.. భిక్కనూరు మండలం కాచాపూర్‌ మండలానికి చెందిన షేక్‌ ఖదీర్‌–సలేహా దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. షేక్‌ ఖదీర్‌ కుటుంబ పోషణ నిమిత్తం కొన్నేళ్ల క్రితమే గల్ఫ్‌కు వెళ్లాడు. అక్కడ కూలీ పనులు చేస్తూ ఇంటికి డబ్బులు పంపుతున్నాడు. ఆ డబ్బులతోనే ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు అయ్యాయి. చిన్నకూతురు షేక్‌ అజియా ఇంటర్‌ వరకు చదివింది. అయితే 2017లో అకస్మాత్తుగా అజియా అనారోగ్యానికి గురికాగా ఆస్పత్రిలో చూపించగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు తేలింది. దీంతో మొదటిసారి రూ. 8 లక్షలు ఖర్చు చేసి, రెండోసారి 2021లో రూ. 5 లక్షలతో స్టంట్లు వేయించారు. దీంతో ఆ కుటుంబంపై అప్పులభారం విపరీతంగా పెరిగింది. కాని నాలుగు నెలల క్రితం మళ్లీ అజియా తీవ్ర అనారోగ్యానికి గురికాగా హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యులు షేక్‌ అజియా కాలేయం పూర్తిగా దెబ్బతిందని పరీక్షల్లో తేల్చడంతో ఆ కుటుంబం బోరున విలపించింది. చివరికి ఆమె అన్న కాలేయంలో 20శాతం ఇచ్చేందుకు ముందుకొచ్చినప్పటికీ సర్జరీకి రూ. 30లక్షలు అవసరమవుతుందని వైద్యులు పేర్కొన్నట్లు బాధిత కుటుంబం వాపోతుంది. ప్రస్తుతం వారికి ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తిపాస్తుల్లేవు. దాతలెవరైన ముందుకొచ్చి సాయం చేస్తేతప్ప అజియా సర్జరీ అయ్యే పరిస్థితి కనిపించట్లేదు. ఫోన్‌పే 9705700754, గూగుల్‌పే 9010559193లో తోచినంత సాయం చేయాలని షేక్‌ అజియా కుటుంబం వేడుకుంటోంది.